క్లుప్తంగా

వేలాల జాతర నిర్వహణకు వేలం



వేలం నిర్వహిస్తున్న స్థానికులు

జైపూర్: మండలంలో ప్రసిద్ధిగాంచిన వేలాలలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న మూడు రోజుల పాటు నిర్వహించే మల్లన్న స్వామి జాతర నిర్వహణకు శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేలం నిర్వహించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపురావు, వేలాల ప్రత్యేక అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యసాగర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో ఆయా గ్రామాలకు చెందిన వారు పాల్గొన్నారు. సుందిళ్ల దేవయ్య కొబ్బరికాయల విక్రయం టెండర్ రూ.4లక్షల 68వేలకు, వేముల తిరుపతి గౌడ్ పార్కింగ్ టెండర్ రూ.3లక్షల 56వేలకు, సంతోశ్ బోల్‌పేలాల విక్రయ టెండర్ రూ.6వేలకు, బండ ప్రసాద్ లడ్డూ విక్రయ టెండర్ రూ.4లక్షల 23వేలకు, బొల్లంపల్లి భూమయ్య లడ్డూప్రసాదం విక్రయానికి టెండర్ రూ.2లక్షల 20వేలకు దక్కించుకున్నట్లుగా తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలఅర్బన్: ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీ ఉపాధ్యాయుల భవిష్యత్తు కార్యచరణలో భాగంగా రాష్ట్ర అడహక్ కమిటీ పిలుపు మేరకు శనివారం డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాధికారి ఎల్.లలిత ఎజెండా పోస్టర్ ఆవిష్కరించారు. నాన్ ఫైనాన్షియల్ విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం త్వరగా ఇష్యూ చేసే విధంగా త్వరతగతిన ముందుకు వెళ్లటం, క్రమబద్ధీకరణ, పేస్కేల్ అమలు చేయాలని తదితర డిమాండ్లతో పోస్టర్ రూపొందించారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, యూనియన్ సభ్యులు మూర్తి, శ్రీనివాస్, యాదగిరి, రజనీ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



ప్రశాంత్‌కు నియామకపత్రం అందజేస్తున్న రాజన్న

జైపూర్: మండలంలోని టేకుమట్లకు చెందిన పాత ప్రశాంత్ ఆదివాసీ నాయకపోడ్ హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాజన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశాంత్‌కు నియామకపత్రం అందజేశారు. జిల్లాలో ఆదివాసీ నాయకపోడ్‌లను ఏకతాటిపై తీసుకురావడానికి కృషి చేయడంతో పాటు కమిటీల ఏర్పాటు చేయడానికి, సంఘ నిర్మాణం కోసం కష్టపడి పని చేయాలని జిల్లా బాధ్యులకు రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు.

వీధి కుక్కల పట్టివేత



వీధి కుక్కలు పడుతున్న సిబ్బంది

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11వ వార్డులో శనివారం 11వీధి కుక్కలను పట్టుకుని స్థానిక అండాళమ్మ కాలనీలో గల ఎనిమల్ కేర్ సెంటర్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌స్పెక్టర్లు టి.ఉదయ్ కిరణ్, యం.వైకుంఠం తెలిపారు. ఎనిమల్ కేర్ సెంటర్‌లో కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయనున్నట్లు తెలిపారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రాణప్రతిష్ట



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

కోటపల్లి: మండలంలోని రాంపూర్ గ్రామంలో అభయాంజనేస్వామి విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమం శనివారం ఘనంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు గోపూజ, విఘ్నేశ్వర పూజ, పుణ్యవచనం, సాంధిముఖం, రక్షాబంధవనం, అఖండ దీపం, నవగ్రవాస్తు, క్షేత్రపాలక సర్వతోభద్ర మండపారాదనం, అగ్నిమధునం, కుండ సంస్కారం, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయాన్నే గ్రామస్తులంతా నియమనిష్టలతో మంగళహారతులతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం గోదావరి నదికి వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో కొల్లూర్ మాజీ సర్పంచ్ జంగ రమేశ్‌రెడ్డి అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సమ్మయ్య భారతి, నాయకులు విద్యాసాగర్, పడాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



భీమారం: శ్రీరామ పట్టాభిషేకం ఘట్టం

భీమారం: మండలంలోని పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఐదు రోజులుగా జరిగిన చిరుతల రామాయణంలో చివరి రోజు శనివారం శ్రీరాముని పట్టాభిషేకం ఘట్టం నిర్వహించారు. రామాయణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పట్టాభిషేకం సమయంలో మహిళలు మంగళహారతులు ఇచ్చి భక్తిని చాటుకున్నారు. అంగడి బాలాజీ(శ్రీరాముడు), అనపర్తి సమ్మయ్య(సీతాదేవి), సెగ్యం రాజేష్(లక్ష్మణుడు), ముంజం తిరుపతి(భరతుడు), జాడి కుమారస్వామి (శ్రతఘ్నుడు), దుర్గం లక్ష్మణ్ (ఆంజనేయుడు), జిమ్మిడి అమర్‌బాబు(రావణ బ్రహ్మ)గా నటించారు.

ఘనంగా గీతా యజ్ఞం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-8 కాలనీలోని గీతా మందిరంలో గీతా యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ 33వ వార్షికోత్సవం, భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం దేవత మూర్తులకు పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలతో కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం గీతా సత్సంగం అధ్యక్షుడు దాసరి రాజేశం ఆధ్వర్యంలో గీతా యజ్ఞాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కన్వీనర్ డీడీ ప్రసాద్, కార్యదర్శి మనోహర్ సభ్యులు ఆనందం, శ్రీనివాస్, అరుణ స్వర్ణకుమారి, వినోద, ప్రచార కార్యదర్శి మారేపల్లి సారయ్య పాల్గొన్నారు.



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

రోడ్డుపై కోతులు..ప్రయాణికుల తిప్పలు



కిష్టంపేటలో చెన్నూర్, మంచిర్యాల ప్రధాన రహదారిపై కోతులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో చెన్నూర్, మంచిర్యాల ప్రధాన రహదారి, అక్కెపల్లి గ్రామ సమీపంలోని చెన్నూర్, మహారాష్ట్ర జాతీయ రహదారిపై కోతులు సంచరిస్తూ వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రయాణికులు రోడ్లపైనే కోతులకు ఆహారం వేస్తుండటంతో రోడ్లపై అటూ, ఇటూ తిరుగుతూ, ద్విచక్ర వాహనదారులపై ఎగబడుతూ బీబత్సం సృష్టిస్తున్నాయి. పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు పట్టించుకొని కోతుల బారి నుంచి కాపాడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు

మంచిర్యాలటౌన్/దండేపల్లి/జన్నారం/లక్సెట్టిపేట/రామకృష్ణాపూర్/భీమారం/వేమనపల్లి/చెన్నూర్‌రూరల్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఢిల్లీలో బీజేపీ ఘన విజయం సాధించినందుకు గాను జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు శనివారం భాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసుకుని సంబురాలు జరుపుకున్నారు. ప్రధాని నరేంద్రమోదీ, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సారథ్యంలో 27ఏళ్ల తర్వాత ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి రావడం ఆనందంగా ఉందన్నారు. గత పదేళ్లలో ఢిల్లీలో కొనసాగిన అవినీతి ప్రభుత్వాన్ని ప్రజలు ఓటుతో తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



దండేపల్లి: మేదరిపేటలో...



భీమారంలో...



లక్సెట్టిపేట: టపాసులు కాలుస్తున్న నాయకులు



జన్నారం: సంబురాల్లో బీజేపీ నాయకులు

పీఆర్పీ చెల్లించాలని జీఎంకు వినతి

శ్రీరాంపూర్: అధికారులకు వేతనంలో భాగమైన పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే(పీఆర్పీ) 2022-23కు సంబంధించిన మొత్తాలను వెంటనే చెల్లించాలని సింగరేణి అధికారుల సంఘం(సీఎంఓఏఐ) నాయకులు యాజమాన్యాన్ని కోరారు. ఆ సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం ఎల్వీ సూర్యనారాయణను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోలిండియాలో జూన్, 2024లోనే పీఆర్పీ చెల్లించినట్లు తెలిపారు. కానీ సింగరేణిలో ఇప్పటికీ చెల్లింపులు చేయకపోవడం వల్ల అధికారులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. వెంటనే పీఆర్పీ మొత్తాలను చెల్లించాలని కోరారు. నవంబర్ 25, 2024న అధికారుల సంఘంతో జరిగిన నిర్మాణాత్మక సమావేశంలో యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సింగరేణి భవిష్యత్తు, ఉత్పత్తి లక్ష్యాల సాధన దృష్ట్యా కంపెనీలో పాలనా పరమైన డైరెక్టర్ల నియామకంలో కొనసాగుతున్న అనిచ్చితిని తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ఏరియా ఉపాధ్యక్షులు లక్కాకుల మహేష్, కిరణ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ భీమన్నతో పాటు అధికారులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న అధికారులు

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఎంసీపీఐ(యూ) నిరసన

బెల్లంపల్లి: తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్ మొండిచేయి చూపించిందని నిరసిస్తూ శనివారం బెల్లంపల్లిలో ఎంసీపీఐ(యూ) శ్రేణులు నిరసన తెలిపారు. సామూహికంగా తరలివచ్చిన ఆ పార్టీ శ్రేణులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం కలగలేదన్నారు. అంకెల గారడి తప్పా పేదలు, అట్టడుగు ప్రజలకు ఆ బడ్జెట్ వ్యతిరేకంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కనీస కేటాయింపులు లేకపోవడం దారుణమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం తెలంగాణపై తీవ్ర వివక్షతను ప్రదర్శించిందని విమర్శించారు. దోపిడీ వర్గాలకు మేలు చేకూర్చే విధంగా బడ్జెట్‌ను తయారు చేశారని పేర్కొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు దొరకకుండా కోత పెట్టారని, వ్యవసాయరంగానికి సరైన కేటాయింపులు లేవన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎంపీలు 8మంది ఉండి కూడా ఏం సాధించలేకపోయారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి వెంకటేష్, నాయకులు రమేష్, రాహుల్, కృష్ణ, ఆకాష్, రవి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న శ్రేణులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కుమార్‌దీపక్ కు శనివారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వర్యం చేసినట్లుగానే ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2024-25 బడ్జెట్లో విద్యకు కేటాయించింది కేవలం 7.3 శాతం మాత్రమేనని, ఇతర రాష్ట్రాల్లో విద్యారంగానికి 14.7 శాతం నిధులు ఇస్తున్నారన్నారు. పాఠశాల విద్యా నాణ్యతలో పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ ప్రకారం 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఉంటే తెలంగాణ రాష్ట్రం 35 స్థానానికి దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైన 20 శాతం బడ్జెట్ కేటాయించి పాఠశాలలు, కేజీ టూ పీజీ నాణ్యమైన విద్య, యూనివర్సిటీలలో మౌలిక వసతులు కల్పించాలని, అధ్యాపకులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మోతె జయకృష్ణ, ప్రధాన కార్యదర్శి డి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి

నస్పూర్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా వారిని తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సీసీసీలోని ఓ ఫంక్షన్ హాల్లో శనివారం బ్రిలియంట్ మోడల్ స్కూల్ ఆన్యువల్ డే ఫంక్షన్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో విద్య అత్యంత ప్రాముఖ్యత కలిగిందని తెలిపారు. క్రమశిక్షణతో ముందుకుసాగితే ఎలాంటి సమస్యనైనా అధిగమించవచ్చన్నారు. విద్యతో పాటు సాంస్కృతిక, క్రీడలు, వ్యాయామం వంటి వాటిపై దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థులు ఏ రంగంలో రాణిస్తారో తల్లిదండ్రులు, గురువులు గుర్తించి వారిని ఆయా రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అధికారుల సమస్యలు పరిష్కరించాలి



జీఎంకు వినతిపత్రం అందిస్తున్న రమేశ్

మందమర్రిరూరల్: సింగరేణిలో కొంత కాలంగా అపరిష్కృతంగా ఉన్న అధికారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఎంవోఏఐ మందమర్రి ఏరియా అధ్యక్షుడు రమేశ్ డిమాండ్ చేశారు. ఏరియా జీఎం ఆఫీస్‌లో శనివారం ఏరియా అధికారులతో జీఎం దేవేందర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యక్షుడు-2 డి. నాగవర్ధన్, జాయింట్ సెక్రెటరీ నరేశ్, జాయింట్ సెక్రెటరీ-2 కే. రవి, జాయింట్ ట్రెజరర్ సంతోష్ ఉన్నారు.

తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు

చెన్నూర్‌రూరల్: తీన్మార్ మల్లన్న రెడ్డి సామాజిక వర్గంపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా చెన్నూర్‌లోని పోలీస్‌స్టేషన్‌లో తీన్మార్ మల్లన్నపై జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం పట్టించుకొని వెంటనే మల్లన్నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెడ్డి సామాజిక వర్గం రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, రత్న సత్యనారాయణరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

పదో తరగతి విద్యార్థులకు క్విజ్

జన్నారం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 15సంవత్సరాలుగా పబ్లిక్ పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలపై తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ప్రథమ బహుమతి కిష్టాపూర్ ఉన్నత పాఠశాల వి ద్యార్థులు ఆకుల అన్వేష్, వేల్పుల నరేందర్, కొత్త అనిల్, ద్వితీయ బహుమతి బాదం పెల్లి ఉన్నత పాఠశాలకు చెందిన జాడి శ్రీవాణి, బండ విజయలక్ష్మి, రాకేష్, తృతీయ బహుమతి చింతగూడ ఉన్నత పాఠశాలకు చెందిన జె.నిహారిక, ఎం.నందిని, జె. గంగ భవాని, నందిని విజేతలుగా నిలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల్లోని ప్రతిభను బయటకు తీసేందుకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కిష్టాపూర్ ప్రధానోపాధ్యాయుడు రాజన్న, కామనపల్లి ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్, కవ్వాల్ ప్రధానోపాధ్యాయుడు కే.శ్రీనివాస్, మురిమడుగు ప్రధానోపాధ్యాయుడు అజయ్, జన్నారం బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామన్న, తపాలపూర్ ప్రధానోపాధ్యాయుడు మురళీధర్‌ను గణిత ఫోరం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో గణిత ఫోరం సభ్యులు రాజన్న, ఆర్.విద్యాసాగర్, గోవర్ధన్, దేవ్‌సింగ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలి

కాసిపేట: కార్మికుల హక్కుల సాధనకు, రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు మిట్టపెల్లి వెంకటస్వామి సూచించారు. మందమర్రి ఏరియా కాసిపేట 2ఇంక్‌లైన్ గనిపై శనివారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు పని ప్రదేశాల్లో సరైన పనిముట్లు, మెటీరియల్, సేఫ్టీ గ్లౌజ్‌లు, బూట్లు, డబుల్ స్టాఫ్ రేకులు లేక కార్మికులు అధిక పనిభారం, మానసిక వేదనకు గురి కావాల్సి వస్తుందన్నారు. కోల్‌మైన్స్ రెగ్యూలేషన్ ప్రకారం వర్క్ నామ్స్ అమలు పర్చాలని, కాసిపేట 2గనిలో బొగ్గు ట్రాన్స్‌పోర్ట్ చేసే లారీలు సమయానికి అందుబాటులో లేక డంపింగ్ చేయడంతో బొగ్గు క్వాలిటీ, క్వాంటిటీ తగ్గిపోయి సంస్థకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ట్రాన్స్‌పోర్ట్ విషయంలో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా యూనియన్‌లో చేరిన 13మంది కార్మికులకు కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గని ఫిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, బెల్లంపల్లి బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, నాయకులు కొండపల్లి నర్సయ్య, బొద్దుల వెంకటేష్, సుభాష్ చంద్రబోస్, కేతన్, రాజకోమురయ్య, రాయలింగు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

● హనుమాన్ చాలీసా పారాయణం

దండేపల్లి: మండలంలోని మేదరిపేట శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. మండలంలోని తాళ్లపేట, దండేపల్లి, మేదరిపేట గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై చాలీసా పఠించారు.

● సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న బీజేపీ నాయకులు

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లి గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవం సమ్మక్క సారలమ్మను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ శనివారం దర్శించుకున్నారు. అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ఆలయ నిర్వాహకులు గొదారి శ్రావణ్ మంగళవాయిద్యాలతో స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య, హాజీపూర్ మండల అధ్యక్షుడు స్వామిరెడ్డి, నాయకులు రమణారావు, రాజమల్లు, తిరుపతి, మల్లన్న పాల్గొన్నారు.

● గాంధారి ఖిల్లా జాతర పోస్టర్ ఆవిష్కరణ

కాసిపేట: మండలంలోని కొండపూర్‌యాపలో శనివారం ఆదివాసీల ఆరాధ్యదైవం గాందారి ఖిల్లా మైసమ్మ మహాజాతర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 14, 15, 16తేదీల్లో జరిగే జాతర పోస్టర్‌ను ఆదివాసీ నాయక్‌పోడ్ సేవాసంఘం, ఆదివాసీ సంఘ, రాజకీయ నాయకులతో కలిసి ఆవిష్కరించినట్లు తెలిపారు. అన్ని తెగల ఆదివాసీలతో పాటు కులమతాలకతీతంగా అందరూ హాజరై అమ్మవారి జాతర విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయక్‌పోడ్ సేవాసంఘం మండల ప్రధానకార్యదర్శి రాజయ్య, మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఆదివాసీ సేనా మండల గౌరవాధ్యక్షుడు గంగారాం తదితరులు పాల్గొన్నారు.

● 'ప్రభుత్వ నిధులు దుర్వినియోగం'

మందమర్రిరూరల్: మండలంలోని అభివృద్ధి పనుల పేరిట ప్రభుత్వ నిధులు దుర్వినియోగమతున్నాయని బీజేపీ మండల నాయకులు దేవరవేన సంజీవరావు ఆరోపించారు. ఎంపీడీవో రాజేశ్వర్‌కు శనివారం నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

● ముత్యాలమ్మ జాతరకు ఏర్పాట్లు

కోటపల్లి: మండలంలోని ఎదులబంధం గ్రామంలో ఈ నెల 9, 10న జరిగే ముత్యాలమ్మ జాతర ఏర్పాట్లను శనివారం తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు జేకశేఖర్ పూజరులు లచ్చయ్య, రాజమల్లుతో కలిసి పరిశీలించారు. ఈ నెల 9న పార్‌పల్లి గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించి అనంతరం మధున పోచమ్మ బోనాలు, 10న లక్ష్మీదేవరా బోనాలు, ముత్యాలమ్మ జాతర జరుగుతుందని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు శేఖర్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్..

చెట్ల తీగలు తొలగించరూ..!

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన ఎల్‌టీ విద్యుత్ లైన్‌కు వివిధ రకాల చెట్ల తీగలు అల్లుకుపోయాయి. దీంతో తరుచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ విషయంలో విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకొని విద్యుత్‌లైన్‌కు అల్లుకున్న చెట్ల తీగలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి :
శంకర్, విద్యుత్ శాఖ ఏఈ
ఫోన్ నంబర్ :
79016 78167



మహాప్రస్థానం పనులు వేగంగా చేయాలి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో నిర్మిస్తున్న మహాప్రస్థానం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు అధికారులను ఆదేశించారు. మహాప్రస్థానం పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించిన అనంతరం పెండింగ్ పనులపై దృష్టిసారించాలని అధికారులకు సూచించారు.



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు